స్తంభించిన జనజీవనం
పంటలు, పొలాలకు తీవ్ర నష్టం
నిర్మానుష్యంగా మారిన రహదారులు
అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలు

# ఎడతెరిపిలేని వాన


ఎర్రుపాలెం : బుచ్చిరెడ్డిపాలెంలో నేలకొరిగిన పొలాలు


చింతకాని : మిర్చిపై పట్టాలు కప్పిన రైతులు


కూసుమంచిలో కురుస్తున్న వర్షం


కూసుమంచి : ధాన్యంపై పట్టాలు కప్పుతున్న రైతులు

కూసుమంచి, డిసెంబర్ 5: తుపాన్ ప్రభావంతో ఎడతెరపు లేని వర్షంతో ఎక్కడి పనులు అక్కడ స్తంభించాయి. రైతులు కల్లాల్లో, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు భగీరత ప్రయత్నాలు చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రైతులు బయటకు వెళ్లలేని పరిస్తితి. ముఖ్యంగా వరి కోతలు పూర్తికాని రైతులు పొలాల్లో ఉన్న ధాన్యం రాలిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాలతోపాటు నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వరి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

చింతకాని, డిసెంబర్ 5 : మండల వ్యాప్తంగా 14 మి.మీటర్ల వర్షపాతం నమోదైందని వ్యవసాయాధికారి నాగయ్య తెలిపారు.

ఎర్రుపాలెం, డిసెంబర్ 5: మండలంలో రెండు రోజులుగా కురుసూన్న వరానికి ఎర్రుపాలెంలో 47.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. తహసీల్దార్ ఎం.ఉషాశారద, ఎస్సై ఎం.సురేశ్, ఏవో విజయభాస్కర్ మాట్లాడుతూ.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే 9000957011, 9705858970 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మధిరరూరల్, డిసెంబర్ 5: మండలంలో ఎడతెరిపి లేకుండా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 150 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా.

మధిర, డిసెంబర్ 5: మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి మంగళవారం మధిరలో 30.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వైరా మున్నేరు ప్రాంతం సమీపంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మధిర మున్సిపల్ కమిషనర్ రమాదేవి సూచించారు. ప్రజలు ఏ సమయంలోనైనా మున్నేరు ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే హెల్ప్‌లైన్ సెంటర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బోనకల్లు, డిసెంబర్ 5: తుపాన్ కారణంగా మండలంలో ఎడతెరిపి లేకుండా సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. మండలంలోని ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షాలకు ప్రధాన రోడ్డు మార్గాల ద్వారా రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు బయటకు రాకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.

ఖమ్మం రూరల్, డిసెంబర్ 5: మిచౌంగ్ తుపాను మండలంలో తీవ్ర ప్రభావం చూపింది. సోమవారం రాత్రి నుంచి మొదలైన ముసురు మంగళవారం రాత్రి వరకు కొనసాగింది. ప్రజలు ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి. ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో రైతులు, కూలీలు, వ్యవసాయ పనులకు ఆటంకం కలిగింది. ఇప్పటికే ధాన్యం పంటను కాపాడుకునేందుకు అవస్థలు పడ్డారు. మున్నేటికి సైతం వరద ఉధృత్తి క్రమక్రమంగా పెరుగుతూ వస్తున్నది. పత్తి, మిర్చి తోటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో కూసుమంచి డివిజన్ వ్యవసాయశాఖ అధికారి ఎస్ విజయచంద్ర, మండల వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు పర్యటించారు. క్షేత్రస్థాయిలో పర్యటన చేసి సంబంధిత రైతులకు సూచనలు చేశారు. పొలాల్లో నిలిచిన వరదనీటిని తక్షణం తొలగించాలని వారు పేర్కొన్నారు.

తిరుమలాయపాలెం, డిసెంబర్ 5: మిచౌంగ్ తుపాను ప్రభావంతో మండలంలోని గ్రామాల్లో మంగళవారం ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. సోమవారం రాత్రి నుంచే వర్షపు జల్లులు పడుతుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. వర్షానికి తోడు చలిగాలులు వీస్తున్నాయి. తుపాన్ ప్రభావంతో పలు గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. తీవ్ర గాలులు వీస్తుండడంతో కోతకొచ్చిన వరి పొలాలు, మిర్చి తోటలు నేలవాలాయి. చేలల్లో తీతకొచ్చిన పత్తి తడిచి ముద్దైంది. కల్లాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం తడిచింది. చేతికిచ్చిన పంటలకు నష్టం వాటిల్లడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రైతులను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**మరో రెండు రోజులు భారీ వర్షాలు : ఏవో వాణి**

కూసుమంచి, డిసెంబర్ 5: మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ అధికారి ఆర్ వాణి అన్నారు. ధాన్యం ఆరబెట్టిన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. భారీ వర్షాలతోపాటు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయిని, వరి కోతలు కోయాల్సిన రైతులు తాత్కాలికంగా నిలిపి వేయాలని కోరారు. మోటర్లు, స్టాటర్లు ట్రాన్స్‌పారాలు, విద్యుత్ స్తంబాల వద్దకు వెళ్లవద్దని కోరారు. మండలంలోని కిష్టాపురం, చింతల్ తండాల్లో ఆమె పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు.


ఖమ్మం రూరల్ : రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు


తిరుమలాయపాలెం : వీధుల్లో నిలిచిన వర్షపు నీరు


కిష్టాపురంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో వాణి


తెట్టెలపాడులో నేలవాలిన మిర్చి తోట

## పిడుగుపాటు జరభద్రం

ఖమ్మం రూరల్, డిసెంబర్ 5: అల్పపీడన ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉన్నదని జిల్లా వ్యవసాయశాఖ, వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. ఇందుకు సంబంధించి మంగళవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం విజయనిర్మల ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ పనులతో పాటు బర్రెలు,. ఆవులు, జీవాలను మేపుతూ పొలాలు, అడవుల్లో తిరిగే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

పిడుగుపడే సమయంలో తీసుకోవాల్సిన చర్యలు

పిడుగు పడే సమయంలో ఆరుబయట ఉన్నట్లైతే ఇల్లు లేదా చుట్టుమూసి ఉన్న పాకలలో ఆశ్రయం పొందాలి. ఎట్టి పరిస్థితిలో చెట్ల కింద ఉండకూడదు. మెరుపులు వచ్చినప్పుడు మెకాళ్లని రొమ్మునకు ఆనుకున్నట్లు కూర్చోవాలి. ఉరుములు వచ్చినప్పుడు ఇంట్లో ఉండే ప్రయత్నం చేయాలని, చేపల వేటకు వెళ్లవద్దని తెలిపారు. డామిని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఉరుములు, మెరుపుల సమాచారం ముందే తెలుసుకోవచ్చు.

ఎవరైనా పిడుగుపాటుకు గురైతే వెంటనే వైద్యశాలకు తరలించాలని, ఊపిరి ఆగినట్లు అనిపిస్తే శ్వాస అందించాలని, గుండె ఆగినట్లు అనిపిస్తు వెంటనే సీపీఆర్ చేయాలని, నాడీ వ్యవస్థ, ఎముకల పనితీరు పరిశీలించాలని తెలిపారు.

## మోహన్‌రెడ్డి మృతికి నివాళి


నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎర్రుపాలెం, డిసెంబర్ 5: మండలంలోని ఇనగాలి గ్రామానికి చెందిన కర్నాటి మోహన్‌రెడ్డి సోమవారం రాత్రి మృతిచెందారు. బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు పంబి సాంబశివరావు, బాలరాఘవరెడ్డి, నరసింహారావు, పెద్దపుల్లారెడ్డి, చిన్నపుల్లారెడ్డి, వెంగళరావు, పొట్టపింజర చిట్టిబాబు, ఇబ్రహీం, పుల్లయ్య, రామారావు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

## 10న మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 5: జిల్లాలో ఈ నెల 10న ఎన్ఎంఎంఎస్ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వరచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణకు జిల్లాలోని మూడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చుంచుపల్లి, బాబూక్యాంపుల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కొత్తగూడెంలోని సింగరేణి హైస్కూల్లో ఆ రోజున ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు ఏసీజీఈ మాధవరావును సంప్రదించాలని కోరారు.

## ప్రియదర్శిని కళాశాలలో వర్క్‌షాపు

ఖమ్మం రూరల్, డిసెంబర్ 5: మండల కేంద్రంలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం టాస్క్ ఆధ్వర్యంలో సాఫ్ట్ స్కిల్స్ ప్రోగ్రాంపై ఒకరోజు వర్క్‌షాపు జరిగింది. మొదటి సంవత్సరం చదువుతున్న బీటెక్, ఎంబీఏ విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహించారు. టాస్క్ ప్రతినిధి బత్తుల అంటోనీ డిసౌజా కమ్యునికేషన్ ప్రక్రియ, కమ్యునికేషన్ అడ్డంకులను ఎలా అధిగమించాలి, కమ్యునికేషన్ యొక్క వివిధ మార్గాలు, బాడీ లాంగ్వేజీపై అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ కాట్రెపల్లి నవీన్ బాబు, ప్రిన్సిపల్ గోపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 5: పదో తరగతి పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు గడువు తేదీని ఈ నెల 7 వరకు పొడిగించినట్లు డీఈవో వెంకటేశ్వరచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాద రుసుము లేకుండా విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేలా హెచ్ఎంలు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ నెల 14 వరకు రూ.50 అపరాద రుసుముతో, ఈ నెల 21 వరకు రూ.200 అపరాద రుసుముతో, జనవరి 3 వరకు రూ.500 అపరాద రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు నిర్ణీత గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. వివరాల కోసం తమ కార్యాలయ అధికారి మాధవరావును 8919279238 సంప్రదించాలని కోరారు.

## 'సామాన్యుడు శక్తివంతంగా మారవచ్చు'


హాజరైన పట్టణ ప్రముఖులు, మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బారావు

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 5: కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా శక్తివంతమైన ఆలోచనలు, నమ్మకాలు, అలవాట్లు, ప్రవర్తనలతో ఉన్న సామాన్యులు కూడా శక్తివంతంగా మారవచ్చని ప్రముఖ సైకాలజిస్టు, డాక్టర్స్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. స్థానిక విద్యానగర్‌లోని ఏవీ ఫంక్షన్ హాల్లో ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన 'రీ ప్రోగ్రామింగ్ ఆఫ్ మైండ్' అనే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రకృతి ఆశ్రమం గౌరవాధ్యక్షుడు బత్తుల కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఒక మనిషి తన ఆలోచనలను తాను నియంత్రించుకోగలిగితే ఉన్నతమైన స్థానంలోకి వెళ్లగలడని పరిశోధనల్లో తేలిందని గుర్తుచేశారు. సామాన్య కుటుంబాల్లో జన్మించిన అనేక మంది సాధారణ వ్యక్తులు వారి ఆలోచనలను శక్తివంతంగా మార్చుకోవడం వల్లనే అసమాన్యులుగా ఎదిగారని అన్నారు. పలువురు ప్రముఖులు ఆదినారాయణ, గోనె శ్రీకాంత్, శ్యాంసుందర్, చంద్రశేఖర్, చిన్నప్పయ్య, వెంకట్, విజయ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల పరిశీలకుడిగా ప్రేంకుమార్

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 5: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పరిశీలకులుగా జిల్లాకు చెందిన ఫుట్‌బాల్ జాతీయ క్రీడాకారుడు భట్టు ప్రేంకుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అనుమతితో రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి రామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 8 నుంచి 10 వరకు మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల నుంచి ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను జాతీయ జట్టుకు ఎంపిక చేసే ప్రక్రియలో ప్రేంకుమార్ ప్రధాన భూమికను పోషించనున్నారు. పాల్వంచ కేటీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రేంకుమార్ రాష్ట్ర ఫుట్‌బాల్ క్రీడారంగంలో సుపరిచితులు. ఎంపికైన ప్రేంకుమార్‌కు ఉమ్మడి జిల్లాల డీఈవోలు వెంకటేశ్వరస్వామి, సోమశేఖరశర్మ అభినందనలు తెలిపారు.